క్లుప్తంగా

ఐక్యతతోనే హక్కుల పరిరక్షణ



మాట్లాడుతున్న ఫరూక్ షుబ్లి

ఎమ్మిగనూరు టౌన్: ఐక్యతతోనే మైనారిటీ హక్కులను పరిరక్షించుకోవచ్చని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరూక్ షుబ్లి అన్నారు. శనివారం పట్టణంలోని ఉర్దూ ఫంక్షన్ హాల్‌లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నూతన శాఖను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కమిటీ అధ్యక్షులుగా బడేసాహెబ్, ఉపాధ్యక్షులుగా మస్తాన్‌వలి, నూరుల్లా ఖాద్రీ, కార్యదర్శిగా నాడంగి నజీర్‌అహమ్మద్, కోశాధికారిగా కటికె రఫీలను నియమించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితులను అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని శనివారం తుగ్గలి పోలీసులు పట్టుకున్నారు. రామలింగాయ పల్లికి చెందిన సుంకన్న, సువర్ణ, రవణమ్మ, శివమ్మ బళ్లారి నుంచి 480 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని సంచులలో రైలులో తీసుకొచ్చి ఎద్దులదొడ్డిలో దిగారు. అక్కడి నుంచి వెళ్లేందుకు ఆటో కోసం వేచి ఉండగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ మల్లికార్జున తన సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకుని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ చెప్పారు.

రేపు మండల సమావేశం

ఆస్పరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6న ఎంపీపీ సుంకర ఉమాదేవి ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధ శనివారం తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. మండలంలోని సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు, ఎస్‌ఐ భూపాలుడు

ఆలూరు: మండల కేంద్రం దేవనకొండలో దిగంబర మూగితాతా ఉరుసును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలను శనివారం దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, ఎస్‌ఐ భూపాలుడు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయన్నారు.

నీటి సమస్య రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాస్

పత్తికొండ రూరల్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ నారాయణదాస్ సూచించారు. శనివారం జరిగిన సర్వ సభ్య సమావేశం ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ పార్థసారథి, డీఎల్‌పీఓ శ్రీకాంత్‌చౌదరి, వైస్‌ఎంపీపీలు బలరాముడు, రంగమ్మ, ఎంపీటీసీలు కునిగిరి నీలకంఠ, మహాలక్ష్మి, రాజు, తలారి లక్ష్మి, నెట్టేకల్లు, నెరవాటి క్రిష్టారెడ్డి, శ్రీనివాసులు, నాగవేణి, ఖాజాబి, లక్ష్మి, లక్ష్మికాంతమ్మ, సరోజ, చంద్ర, సర్పంచులు వెంకటమ్మ పాల్గొన్నారు.

కరాటే విజేత వెల్దుర్తి



అతిథులతో ట్రోఫీ అందుకుంటున్న వెల్దుర్తి పద్మవిద్యావికాస్ స్కూల్ విద్యార్థులు

వెల్దుర్తి: ఇంటర్ డోజో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వెల్దుర్తి పద్మవిద్యావికాస్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకున్నారు. శనివారం స్థానిక అల్లీపీర స్వామి భజన మందిరం ఆవరణలో నిర్వహించిన కరాటే పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వెల్దుర్తి పద్మవిద్యావికాస్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా బేతంచెర్ల మండలం గోరుమానుకొండ మోడల్‌స్కూల్ క్రీడాకారులు ద్వితీయ స్థానం కైవసరం చేసుకున్నారు. విజేతలకు ట్రోఫీలను, బహుమతులను జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న అందించారు. అంతుకుముందు పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీ కరాటే అకాడమీ ఇన్‌చార్జ్ ఫయాజ్, పద్మ విద్యావికాస్ స్కూల్ యాజమాని బడేసా, కరాటే మాస్టరు పాల్గొన్నారు.



కుక్కకాటు బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. మొన్న ఒక్కరోజే కుక్కలు పది మందిని కరిచాయంటే పరిస్థితి ఎంతలా ఉందనేది అద్దంపడుతోంది. పట్టణంలో చికెన్, మటన్ సెంటర్ల వద్ద పడేసిన వ్యర్థాలను తిన్న కుక్కలు.. వాటికి అలవాటు పడి గుంపులుగా సంచరిస్తూ ఆకలితో వీధి వెంట వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. బైక్‌లపై వెళ్లే వారినీ వెంబడించి కరిచేస్తున్నాయి. ఇక చిన్నారులు, వృద్ధులను బయటకు పంపాలంటేనే ప్రజలు జంకుతున్నారు.

బాబోయ్ కుక్కలు

- ఆరు నెలల్లో 412 మందికి కుక్కకాటు
- బెంబేలెత్తిపోతున్న జనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



పత్తికొండలోని ప్రధాన రోడ్డులో జనంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

పత్తికొండ రూరల్: పట్టణంలో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ కనిపించిన వారందరినీ కరిచేస్తున్నాయి. ఆరు నెలల్లో దాదాపు 412 మంది కుక్క కాటుకు గురై స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఆస్పత్రి రికార్డులను బట్టి చూస్తే గత సెప్టెంబర్‌లో 53 మంది, అక్టోబర్‌లో 73, నవంబర్ 60, డిసెంబర్ 72, జనవరి 80, ఫిబ్రవరిలో 74 మంది కుక్కల కాట్లకు గురయ్యారు. కుక్కల సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. వీధి కుక్కలను నియంత్రించడంపై పంచాయతీ అధికారులు శ్రద్ధ వహించకపోవడంతో పట్టణ వాసులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



గాయపడిన ప్రైవేటు వైద్యుడిని పరిశీలిస్తున్న సిబ్బంది

రోడ్డుపై వెళ్తుండగా కుక్క కరిచింది



కోర్టు ముందు ప్రధాన రోడ్డులో వెళ్తుండగా నున్న కుక్క కరిచేసింది. నాపక్కనే ఉన్న జూనియర్ న్యాయవాది ఇలియాస్‌బాషాను కూడా కరిచింది. మూడు రోజుల క్రితం పదకొండు మందిపై కూడా కుక్కల దాడికి గురై ఆసుపత్రిని ఆశ్రయించారు. కుక్కల దాడిలో జనం గాయాలపాలైనా అధికారుల స్పందన కరువైంది. పంచాయతీ అధికారులు మొద్దునిద్ర వీడి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. – శ్రీనివాసరెడ్డి, న్యాయవాది, పత్తికొండ

కుక్కలు వెంటపడుతున్నాయి



వీధిలో వెళ్తున్నప్పుడు కుక్కలు వెంటపడుతున్నాయి. మందలు, మందలుగా సంచరిస్తూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాలనీల్లో చిన్నపిల్లలను బయటకు పంపించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – మహేష్, పత్తికొండ

కుక్కకాటు కేసులు పెరిగాయి

కుక్కకాటుకు గురై చాలా మంది ఆసుపత్రికి వస్తున్నారు. కుక్క కరిస్తే వెంటనే గాయాన్ని సబ్బుతో కడిగి ప్రభుత్వాసుపత్రిని సంప్రదించాలి. రేబిస్ వ్యాక్సిన్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంది.

– విజయభాస్కర్, వైద్యుడు, ప్రభుత్వాసుపత్రి, పత్తికొండ

గులాబీ పురుగు నివారణకు ముందస్తు చర్యలు

ఎమ్మిగనూరు: పత్తి పంటను ఆశిస్తున్న గులాబీ పురుగు నివారణకు రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఏడీఏ మహ్మద్‌ఖాద్రీ సూచించారు. శనివారం ఆయన స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పత్తిలో బీటీ రకాలు, నాన్‌బీటీ రకాలను కలిపి నాటకపోవటం, దీర్ఘకాలిక రకాలు(150 రోజులకంటే) సాగుచేయటం, పంటను ఫిబ్రవరి నెల తరువాత కూడా కొనసాగించటం వంటి తప్పిదాలతో గులాబీరంగు పురుగు ఆశిస్తుందన్నారు. పంట పూర్తయిన తరువాత పత్తి పంటను గొర్రెలు, మేకలు పూర్తిగా తినేలా చేయాలన్నారు. పత్తితీత పూర్తయిన తరువాత మొదళ్లను అలానే వదిలేయకుండా రోటావేటర్‌తోగాని షద్దర్‌తోగాని మొదళ్లను నుసి చేసి పొలంలో కలియ దున్నాలన్నారు. పత్తికట్టెలను వంట చెరుకుగా వాడకుండా తగలబెట్టాలన్నారు. పంట మార్పిడి, యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని సూచించారు.

అర్థమయ్యే విధంగా బోధించాలి

నందవరం: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ పద్ధతిలో పాఠాలు బోధించాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని జగ్గాపురం, హెచ్ బాపురంలోని ఎంపీపీ పాఠశాలలను తనిఖీ చేసి 4, 5 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ప్రవీణ్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

పరీక్షల పట్ల భయం వద్దు



మాట్లాడుతున్న వేణుగోపాల్

ఆస్పరి: పదవ తరగతి పరీక్షలంటే భయం, ఆందోళన చెందరాదని ప్రశాంతంగా రాయాలని సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ వేణుగోపాల్ విద్యార్థులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ప్రముఖ వక్త సుబ్బారెడ్డితో మోటివేటివ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సలహాలు పాటిస్తే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రోజూ ఉదయాన్నే ధ్యానం చేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. వేకువ జామునే చదివితే బాగా గుర్తుంటాయన్నారు. గాలి, వెలుతురు ఉన్న చోట చదవాలన్నారు. పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని, ప్రశ్న పత్రం పూర్తిగా చదవిన తరువాత జవాబులు రాయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం సుజాత, కస్తూర్బా మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు విజయలక్ష్మి, ఫణీంద్ర పాల్గొన్నారు.

- ఆలూరు: దేవనకొండ మండలం తెర్నెకల్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో ఏపీసీ వేణుగోపాల్ మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో దేవనకొండ ఎంఈఓ రంగస్వామి, హెచ్‌ఎం సుభాసిని పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న సిద్దన్న, చిత్రంలో బంధువులకు నగదు అప్పగిస్తున్న 108 సిబ్బంది

ఆలూరు రూరల్: స్కూటర్ అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బాధితుడి బంధువులు తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన సిద్దన్న ఉదయం హొళగుందకు వచ్చాడు. తెలిసిన వారి వద్ద అవసరం నిమిత్తం రూ.2.50 లక్షల నగదు తీసుకుని ద్విచక్రవాహనంపై కర్నూలుకు బయలుదేరాడు. మార్గమధ్యలో పెద్దహోతూరు గ్రామం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు. కాగా అతని వద్ద ఉన్న నగదును బాధితుడి కుటుంబ సభ్యులకు అందించి 108 సిబ్బంది ఈఎంటీ రంగస్వామి, పైలెట్ భీమయ్య తమ నిజాయితీని చాటుకున్నారు.

ఎంబీ నాగప్ప మృతి

ఎమ్మిగనూరు: పట్టణ ప్రముఖుడు ఎంబీ నాగప్ప(86) శనివారం రాత్రి మృతిచెందారు. వృద్ధాప్య సమస్యలతో మనోజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక ఉదయం తుదిశ్వాస విడిచారు. 1936లో జన్మించిన నాగప్ప.. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన సమయంలో ఆ పార్టీలో చేరి కీలకంగా పని చేశారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి తదితరులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల పరిధిలోని పట్టభద్రుల అభ్యర్థులకు ఓటరు సిప్పులను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. ఓటరు స్లిప్పులను శనివారం ఆయన ఆయా గ్రామాల వీఆర్వోలకు అందజేశారు. వీటిని అన్ని గ్రామాల్లోని ఓటర్లకు ఆదివారం పంపిణీ చేసి వారి వద్ద నుంచి సంతకాలు సేకరించాలని సూచించారు. పంపిణీ చేసిన తరువాత ఇంకా ఎవరికైనా స్లిప్పులు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

వార్డు సభ్యులతో సమావేశం

హొళగుంద: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ వార్డు సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో అభివృద్ధి పనులను ప్రస్తావించకుండా వేసవికి సంబంధించి తాగునీరు, పంచాయతీ వేలం పాటల గురించి చర్చించి సమావేశం ముగించారు.

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలి



అయ్యకొండలో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

- ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: మండల పరిధిలోని అయ్యకొండ గ్రామ సమీపంలో ఎల్లెల్సీ మీద రూ.40 లక్షలతో నిర్మించే బ్రిడ్జి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి కంట్రాక్టర్, అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం ఆయన పనులను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అయ్యకొండ గ్రామం నుంచి కడిమెట్ల గ్రామం మీదుగా ఎమ్మిగనూరు తదితర గ్రామాలకు రోడ్డు ప్రయాణం సులభమవుతుందన్నారు. కాలువపై బ్రిడ్జి నిర్మించడంతో రైతులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మిగనూరు ఇరిగేషన్ డీఈ లక్ష్మణకుమార్, ఏఈ మణికంఠ, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ మృత్యుంజయ, ధర్మకారి నాగేశ్వర రావు, క్లాస్1 కాంట్రాక్టర్ బి.వీరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరు టౌన్: విద్యార్థినులు చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా శనివారం కళాశాలలో విద్యార్థినులకు ఖోఖో, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, బ్లైండ్ ఫోల్డ్ గేం, పాటల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు మనోరంజన్, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



నెరణికి తండాలో మాట్లాడుతున్న ఆలూరు జడ్జి తరణీ

హొళగుంద: గ్రామీణ ప్రాంత మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆలూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి తరణీ అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా శనివారం నెరణికి తండాలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి తరణీ.. మహిళల హక్కులు, ఇతర అంశాల గురించి మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, న్యాయపరంగా విధించే శిక్షల గురించి వివరించారు. ఆడపిల్లలను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ పాల్గొన్నారు.

- పత్తికొండటౌన్: చట్టాలపై అవగాహన కలిగిఉండాలని బార్‌అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి వై.మధుబాబు, లీగల్‌ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది తంబళ్ల నాగేశ్ మహిళలకు సూచించారు. శనివారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. చట్టాల గురించి తెలుసుకున్నపుడే మహిళలు తమ హక్కులను కాపాడుకోగలరన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారిణి ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయవాదులు దామోదరాచారి, నెట్టేకల్లు, లోక్‌అదాలత్ క్లర్క్ రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం







ఆకుపందిరి ఊరేగింపులో పాల్గొన్న ఈఓ, గద, విల్లును అందజేస్తున్న దాత, స్వామి మూలవిరాట్

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి విష్వక్సేన పూజల అనంతరం కలశస్థాపన, అంకురార్పణ, ధ్వజా రోహణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీరంగనాథుడు సతీసమేతుడై పల్లకీ సేవతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కాగా కొనుకొండ్ల సుబ్బారావు రూ.12 వేల విలువ చేసే ఉత్తడి గద విల్లు, పిల్లన గ్రోవిని స్వామివారికి విరాళంగా అందజేశారు. ఉత్సవాల్లో ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



కటారుకొండలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

కృష్ణగిరి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను, సచివాలయ ఉద్యోగులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అభ్యర్థించారు. శనివారం ఆమె అమకతాడు, కోయిలకొండ, కటారుకొండ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. పట్టభద్రులను చైతన్యపరస్తూ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కోయిలకొండ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే తనిఖీచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, పత్తికొండ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, సర్పంచ్ బోయ సర్వేశ్వరి, నాయకులు బాలమిన్నెల్ల, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తలారి కృష్ణయ్య, జయరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివ, రామచంద్రుడు, రహిమతుల్లా, చంద్రమోహన్‌గౌడ్, శేషు, సురేష్, సుదర్శనాచారి, సుభాష్, తిరుపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- తుగ్గలి: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, వైస్ ఎంపీపీలు మల్లికార్జునరెడ్డి, నాగప్ప, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని జొన్నగిరి, పగిడిరాయి, రామలింగాయపల్లి, పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు.
- మద్దికెర: జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మద్దికెరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.
- నందవరం/గోనెగండ్ల: వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్ ఆధ్వర్యంలో కనకవీడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. అలాగే గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్, మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.
- హొళగుంద: మండల కేంద్రంలో వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజారెడ్డి ప్రచారం నిర్వహించారు.